క్లుప్తంగా

ఎంవీపీ రైతుబజార్‌కు రాష్ట్ర స్థాయి పురస్కారం



సీఎం చేతులు మీదుగా అవార్డు అందుకుంటున్న సుధాకర్, వరహాలు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ రైతు బజార్‌కు రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ రైతుబజార్ అవార్డ్‌–2025 లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్వచ్ఛాంధ్ర అవార్డుల్లో భాగంగా ఈ అవార్డును ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ఏడాది రాష్ట్ర స్థాయిలో 69 అవార్డులు ప్రకటించగా, అందులో స్వచ్ఛ రైతు బజార్ అవార్డు ఎంవీపీ రైతు బజార్‌కు లభించింది. విజయవాడలో సోమవారం జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఎంవీపీ రైతు బజార్ ఈవో వరహాలు, జిల్లా మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ పి.సుధాకర్ ఈ అవార్డును అందుకున్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్

విశాఖ సిటీ: ప్రజల అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. మాస్టర్‌ప్లాన్‌–2041పై సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. త్వరలోనే సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తామన్నారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, ఇతర విభాగ అధికారులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేసి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు,ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

ఇందిరానగర్‌లో అందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇందిరానగర్ వాసులు

మహారాణిపేట: విశాఖ రూరల్ మండల పరిధిలోని ఇందిరానగర్‌లో అర్హులందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, గతంలో పట్టాలు ఇచ్చిన వారికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టాలని కోరుతూ స్థానికులు ఆందోళన చేపట్టారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. 30 ఏళ్లుగా పాత డైరీఫారం వద్ద ఉన్న ఇందిరానగర్‌లో నివసిస్తున్నామని, తమ ఇళ్లకు రిజిస్ట్రేషన్లు లేవని, ఇక్కడ 108 సర్వే నంబర్‌లో ఉన్న వారికి రిజిస్ట్రేషన్‌లు చేస్తున్నారని, తమకు ఎలాంటి రిజిస్ట్రేషన్లు లేవని చెప్పారు. కొంత మందికి ఎల్‌పీ నంబర్లు కూడా ఇచ్చారని, వివిధ కారణాలు చూపించి ఇక్కడ ఉన్న వారికి పట్టాలు ఇవ్వడం లేదని, తమకు కూడా పట్టాలు ఇవ్వాలని కలెక్టర్‌ను ఇందిరానగర్ వాసులు కోరారు.

బీచ్.. వసతులు ఫ్లాప్

- సాగరతీరంలో కానరాని వసతులు
- మరుగుదొడ్ల సంఖ్య అంతంత మాత్రం
- పర్యాటకులకు తప్పని అవస్థలు

విశాఖ నగరానికి ప్రకృతి అందించిన మణిహారం సాగరతీరం. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకుల సందర్శనీయ స్థలాల్లో మొట్టమొదటి ప్రాధాన్యం బీచ్‌కే. గంభీరమైన సముద్రాన్ని చూస్తూ గంటల తరబడి ఉండిపోయే వారితో పాటు అలలతో పోటీపడి ఆటలాడే సందర్శకులు వేలల్లో ఉంటారు. ఇలా తీరానికి నిత్యం వచ్చే పర్యాటకుల సంఖ్యకు అనుగుణంగా వసతుల కల్పన ఉందా అంటే ప్రశ్నార్థకమే. కనీస అవసరాలైన టాయిలెట్స్ కూడా పూర్తిస్థాయిలో అందుబాటులో లేని పరిస్థితి ప్రస్తుతం బీచ్‌రోడ్డులో ఉంది. సౌకర్యాలను మరింత మెరుగుపరిచే దిశగా అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉంది.



ఆర్.కె బీచ్ వద్ద నామమాత్రంగా ఉన్న టాయిలెట్స్

ఏయూక్యాంపస్: సాగర తీరానికి నగరవాసులతో పాటు, రాష్ట్రం నలుమూలల నుంచి, పొరుగు రాష్ట్రాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో పర్యాటకులు వస్తుంటారు. వీరికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై మాత్రం అధికారులు దృష్టి సారించడం లేదు. ఆర్.కె బీచ్ నుంచి సాగర్ నగర్, రుషికొండ తీరం వరకు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. పొరుగు రాష్ట్రాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు సముద్ర తీరంలో సేదతీరడానికి, తీరంలో స్నానాలు చేయడానికి ఆసక్తి చూపుతుంటారు.

దుస్తులు మార్చుకోవాలంటే అవస్థలే..

సాగరతీరంలో స్నానం చేయాలని ఎంతోమంది ఆసక్తి చూపుతుంటారు. అలాగే తీరంలో అలల ఉధృతికి ఎంతోమంది తడిచిపోతుంటారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకుల్లో మహిళలు అధిక సంఖ్యలో ఉంటారు. అయితే, వీరు తడిచిన దుస్తులను మార్చుకునేందుకు కూడా బీచ్‌లో సరైన వసతులు లేవు. దీంతో ఎక్కువమంది ఆరుబయట, కార్ల వెనక దుస్తులు మార్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ కేవలం రెండు టాయిలెట్స్ ఉన్నాయి. కాళీమాత ఆలయం వద్ద నున్న టాయిలెట్ సముదాయం చాలా చిన్నదిగా ఉంది. అదేవిధంగా ఆర్.కె బీచ్ లో ఏర్పాటు చేసిన మరొక టాయిలెట్ నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. ఈ రెండు టాయిలెట్స్ వినియోగించాలంటే పర్యాటకులు నిర్ణీత రుసుము చెల్లించాలి. వాస్తవానికి ఇక్కడ చెల్లించాల్సిన దానికంటే అధికంగానే అక్కడ పనిచేసే సిబ్బంది వసూలు చేస్తుంటారు. పాండురంగాపురం, వైఎంసీఏ వద్ద మరొర రెండు టాయిలెట్స్ ఇదేవిధంగా నిర్వహణ జరుగుతున్నాయి. సుదీర్ఘమైన తీర ప్రాంతం ఉన్నా, అరకొర టాయిలెట్స్ ఉండటంలో పర్యాటకులు, నగరవాసులు ఇబ్బంది పడుతున్నారు.



వైఎంసీఏ వద్ద ఉన్న టాయిలెట్స్



రోడ్డుపైనే బట్టలు ఎండవేసుకుంటున్న పర్యాటకులు

కమిషనర్ ఆదేశించినా..

జీవీఎంసీ కమిషనర్‌గా కేతన్‌గార్గ్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఆర్.కె బీచ్ వద్దనున్న టాయిలెట్స్‌ను పరిశీలించారు. నూతన టాయిలెట్స్ నిర్మాణం చేపట్టాలని, వీటికి అనువైన ప్రదేశాలను గుర్తించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీటి నిర్మాణానికి ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు, చొరవ చూపిన దాఖలాలు లేవు. పెరుగుతున్న పర్యాటకులకు అనుగుణంగా సాగర తీరంలోని పలు ప్రాంతాల్లో ఉచిత మరుగుదొడ్లు నిర్మించే దిశగా మాత్రం అధికారులు అడుగులు వేయడం లేదు. అధికారులు ఇప్పటికైనా అనువైన ప్రదేశాలను గుర్తించి పర్యాటకులకు ఉపయుక్తంగా టాయిలెట్స్ నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇది పర్యాటకులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది.



కాళీమాత ఆలయం వద్ద ఉన్న చిన్న టాయిలెట్స్



పాండురంగాపురం వద్ద ఉన్న టాయిలెట్స్

ఆదాయంపై ఉన్న శ్రద్ధ పర్యాటకులపై ఏది?

అధికారులకు, పాలకులకు ఆదాయాన్ని పెంచుకోవడంపై ఉన్న శ్రద్ధ పర్యాటకులకు వసతుల కల్పనపై లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల టీయూ–142 యుద్ధ విమానం పక్కనే రెండు అంతస్తుల్లో నిర్మాణానికి వ్యాపార సంస్థకు కేటాయించారు.

దీనికి సంబంధించిన పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. వీటిని నిర్మించవద్దని అనేకమంది నిరసనలు తెలపడంతో పాటు అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినప్పటికీ వీటిని పక్కన పెట్టి యథాతథంగా నిర్మాణాలు జరుపుతున్నారు.



తీరంలో నిర్మాణంలో ఉన్న వాణిజ్య సముదాయం

మంచి ఆహారంతో గుండె ఆరోగ్యం పదిలం

ఏయూక్యాంపస్: మంచి ఆహారంతో గుండె ఆరోగ్యం పదిలంగా ఉంటుందని పోషకాహార నిపుణురాలు షీలా కృష్ణమూర్తి తెలిపారు. భారతీయుల్లో గుండె సంబంధసమస్యలు పెరుగుతున్నాయని, కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులో నిర్వహించిన ఒక ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిత్యం తీసుకునే ఆహారంలో బాదం భాగం చేసుకోవాలని సూచించారు. చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సహజ సిద్ధమైన, సంపూర్ణ ఆహారంగా బాదం నిలుస్తుందని, రోజంతా శరీరానికి అవసరమైన పోషకాలు, శక్తిని అందిస్తుందని తెలియజేశారు. సరైన ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అలవరచుకోవాలని సూచించారు. విటమిన్ ఈ, మెగ్నీషియం వంటివి బాదంలో పుష్కలంగా ఉంటాయన్నారు.

వార్డులో సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజలను సమస్య అడిగి తెలుసుకుంటున్న పల్లా దుర్గారావు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో ప్రజల సమస్యలను జీవీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తానని వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తెలిపారు. సోమవారం ఆయన వార్డులో పర్యటించి, ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. న్యూ పిఠాని వీధిలో యూజీడీ లైన్ల సమస్య ఉందని, అలాగే స్పీడ్ బ్రేకర్లు లేక వాహనాదారులు వేగంగా వెళ్తున్నారని స్థానికులు పల్లా దృష్టికి తీసుకువచ్చారు. ఆయన తక్షణమే జీవీఎంసీ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు సిమ్మా శ్రీను, సంపంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య మద్యం షాపు ఎత్తివేయాలి



మద్యం షాపు ఎత్తివేయాలని కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

మహారాణిపేట: సాగర్‌నగర్‌లో సుభాష్‌నగర్‌లో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపు వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే ఎత్తివేయాలని మహిళలు కోరారు. సోమవారం పీజీఆర్ఎస్‌లో పలువురు మహిళలు కలెక్టర్ ఎం.ఎస్.హరేందిర ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపు వల్ల ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అర్ధరాత్రి వరకు ఇక్కడ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని, ఎవరైనా ప్రశ్నిస్తే వారితో షాపు వాళ్లు ఘర్షణకు దిగుతున్నారని మహిళలు వాపోయారు. తాగిన మైకంలో ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని, రాత్రి సమయంలో తాగుబోతుల వల్ల మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ మద్యం షాపు వద్దని ఎన్నిసార్లు చెప్పినా ఎవరు వినడం లేదని.. ఇప్పటికి పీజీఆర్ఎస్‌లో నాలుగు సార్లు ఫిర్యాదు చేశామని, ఇది అయిదో సారి అని, తక్షణం షాపు తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

'వరల్డ్ స్పేస్ వీక్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగంలో స్టూడెంట్ సొసైటీ ఉర్విక్రుతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వరల్డ్ స్పేస్ వీక్‌పై విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 10వ తేదీన విభాగ విద్యార్థులకు క్రీడా పోటీలు, 11న మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్), 12న ఐడియాథాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 13న పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్, 14 స్పేషియల్ టెక్నాలజీస్–ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై సదస్సు, విశిష్ట ప్రసంగాలు, వివిధ పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జగదీశ్వరరావు, విద్యార్థులు జి.ఆశిష్, డి.ఎస్.ఎస్ చంద్రవర్ధన్, ఆర్.రిష్, ఎ.సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీఎంఆర్‌డీఏ పార్కుల తోటమాలులు

మహారాణిపేట: వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో పనిచేసిన తోటమాలీలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వుడా వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు పాల్గొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు, సీఐటీయూ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ తోటమాలిలను విధుల నుంచి తొలగించి ఏడాది పూర్తయినా.. నేటికీ తిరిగి పనిలోకి తీసుకోలేదని, నష్టపరిహారం కూడా చెల్లించలేదన్నారు. దీనిపై కార్మిక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్మికులు 30 ఏళ్లుగా వీఎంఆర్‌డీఏ పార్కుల్లో పనిచేస్తున్నారని, వారికి ఎటువంటి పరిహారాలు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని వెంకటరావు ప్రశ్నించారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు సిహెచ్.రాంబాబు, దేవాడ నరసింగరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు అభినందనలు



డాక్టర్ కాలేషా బేగంను అభినందిస్తున్న ముస్లిం ప్రముఖులు

దాబాగార్డెన్స్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల ముంబైలో జరిగిన అసోసియేషన్ ఆఫ్ ముస్లిం ప్రొఫెషనల్స్(ఏఎంపీ) జ్యూరీ సమావేశంలో విశాఖ చినగదిలి జిల్లా పరిషత్ హైస్కూల్ మ్యాథ్స్ అసిస్టెంట్ డాక్టర్ కాలేషా బేగం ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం ఆమెను హైదరాబాద్‌లో మకత్ ట్రస్ట్ చైర్మన్, సభ్యులు, పలువురు ఉపాధ్యాయులు అభినందించారు. బాలికలకు విద్య, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు జాతీయ స్థాయిలో ఈ అవార్డు లభించింది. డాక్టర్ కాలేష బేగం వృత్తిపరంగా ఉపాధ్యాయునిగా తన బాధ్యతలు నిర్వహిస్తూ, ప్రవృత్తిపరంగా కూచిపూడి నృత్యంలో పాఠశాల విద్యార్థులకు శిక్షణ ఇస్తూ, అనేక మందిని జాతీయ స్థాయి నృత్య పోటీలకు రాష్ట్రం నుంచి పంపించారు. అనేక పతకాలు సాధించిపెట్టారు. డాక్టర్ బేగం నిర్వహిస్తున్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ ట్రస్ట్ ద్వారా కెరీర్ గైడెన్స్, ఆర్ట్ అండ్ కల్చర్‌లో మార్గదర్శిగా ఉంటూ అనేక మంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

పథకాలన్నీ నీరుగారుస్తున్నారు

- వైఎస్సార్‌సీపీ నాయకుల ఆవేదన
- పదో వార్డులో 'బాబూ ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



పదో వార్డు ఎస్ఐజీ నగర్‌లో స్థానికులకు కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆరిలోవ: పేద ప్రజలకు గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం నీరుగారుస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పేదల జీవనం భారంగా మారిందన్నారు. జీవీఎంసీ పదో వార్డులో పార్టీ వార్డు అధ్యక్షుడు పతివాక కనకరాజు ఆధ్వర్యంలో సోమవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఎస్ఐజీ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి, కూటమి ప్రభుత్వం మోసాలపై ముద్రించిన కరపత్రాలను అందించారు.

కూటమి ప్రభుత్వంలో ఎలాంటి మోసాలు జరుగుతున్నాయో ప్రజలకు వివరించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆస్పత్రులకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకుండా నీరు గారుస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కోసం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను నిలిపేసే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని, ప్రజలు దీన్ని గమనించాలని కోరారు. వార్డుల్లో కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బోండా శ్రీనివాసరావు, సతివాడ వెంకటలక్ష్మి, గోవింద్, బీజపు పైడిరాజు, పడాలి శేఖర్, ముద్దాడ కృష్ణ, గణపతి, హరిబాబు, బి.టి నాయుడు, రవికుమార్, సంతోష్, జాషువా, జయశ్రీ,దేవి, కుమారి, రామయ్యమ్మ, సత్యవతి, శారధ, పద్మ పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో విద్యార్థినులకు హోం మంత్రి పరామర్శ



చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శిస్తున్న హోం మంత్రి అనిత

మహారాణిపేట : పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం ఏకలవ్య బాలికల గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థినులను హోంమంత్రి అనిత సోమవారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ బాధిత విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారని, వైద్య నిపుణులతో ఒక కమిటీ వేశామని తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

నత్తనడకన పోలీస్ స్టేషన్ రోడ్డు నిర్మాణం



ఆరిలోవ పోలీస్ స్టేషన్ రహదారి కోసం గెడ్డపై నిర్మిస్తున్న వంతెన

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరిలోవ కాలనీలో ఉండే పోలీస్ స్టేషన్ ఇరుగ్గా మారడంతో విమ్స్, ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రి మధ్యలో సుమారు ఎకరం స్థలంలో కొత్త పోలీస్ స్టేషన్ నిర్మించారు. ఈ పోలీస్ స్టేషన్ భవనం ఏడాది క్రితం ప్రారంభమైన విషయం తెలిసిందే. అంతవరకు బాగానే ఉన్నా, ఈ స్టేషన్‌కు వెళ్లడానికి ప్రత్యేకంగా రోడ్డు లేకపోవడంతో బీఆర్‌టీఎస్ వైపు విమ్స్ గేటు నుంచే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సి వస్తోంది. దీని కోసం ప్రత్యేకంగా రహదారి నిర్మించదలిచారు. పోలీస్ స్టేషన్ ప్రారంభమైన మొదటిలోనే రహదారి నిర్మాణం కోసం శంకుస్థాపన చేశారు. ఇందులో భాగంగా ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి పక్కన బీఆర్‌టీఎస్ వైపు గెడ్డపై వంతెన నిర్మాణం పనులు చేపట్టారు. సుమారు ఆరు నెలల్లో పూర్తి చేయాలని ప్రణాళిక వేసి, నిర్మాణం చేపట్టారు. కానీ ఏడాది గడుస్తున్నా ఇంతవరకు పనులు పూర్తి కాలేదు. పనులు నత్తనడకన సాగుతుండటంతో ఇంతవరకు రహదారి లేకుండాపోయింది. ఇక్కడ వంతెన పనులు త్వరితగతిన పూర్తి చేసి, పోలీస్ స్టేషన్‌కు రహదారి అందుబాటులోకి తీసుకురావాలని పోలీస్ సిబ్బంది, స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఎయిడెడ్ టీచర్లకు ఇంకా అందని వేతనాలు

ఆరిలోవ: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు నెల వేతనాలు ఇంతవరకు చెల్లించలేదు. జిల్లాలో 17 ఎయిడెడ్ పాఠశాలల్లో సుమారు 65 మంది వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారంతా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ ఆందోళనన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎయిడెడ్ టీచర్ల వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

గడువులోగా వినతులు పరిష్కరించాలి

విశాఖ సిటీ : వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతులను పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి తొమ్మిది వినతులను స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

జేకేసీ.. దిక్సూచి



క్యాంపస్ డ్రైవ్‌లో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులు

దాబాగార్డెన్స్: పాత జైల్‌రోడ్డులోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థినులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్రతిభ చూపుతున్నారు. ఈ కాలేజీలో ఏర్పాటు చేసిన జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ) ద్వారా వీరు శిక్షణ పొందుతూ సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఉన్నత విద్య, ఉద్యోగాల సాధనకు అనుగుణంగా విద్యార్థినులను జేకేసీ తీర్చిదిద్దుతూ దిక్సూచిగా నిలుస్తోంది. లాగ్వేంజ్ లెర్నింగ్, రీజనింగ్, ప్రాక్టీస్, గ్రూప్ డిస్కషన్స్ వంటి శిక్షణ ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీయడం, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంచడం వంటివి చేస్తూ వారిని ఉన్నత విద్యావంతులుగా మార్చడంతోపాటు ఉద్యోగావకాశాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తోంది. మహిళా కళాశాలలో ఉన్నత విద్య ఆఖరి దశలోనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ.. విద్యార్థినులు ఉద్యోగులుగా మారుస్తూ వారిలో ఆత్మవిశ్వాసాన్ని జేకేసీ పెంపొందిస్తోంది.